


# శ్రీను వైట్ల

ఏడేళ్ళ క్రిందట 'నీకోసం' సినిమాతో దర్శకుడిగా తెలుగు ప్రేక్షకులకి పరిచయమై, మొదటి సినిమాకే ఏడు నంది బహుమతుల్ని గెలుచుకుని, 'ఎవరీ సరికొత్త టేకింగ్ ఉన్న కుర్రాడూ.. !?' అని అందరి దృష్టిని అకర్షించిన శ్రీను వైట్ల 'ఆనందం' తో ఎంత సక్సెస్ సాధించారో అందరికీ తెలుసు. అప్పటినుంచీ ఇటీవలే విడుదలైన ఢీ, దుబాయ్ శీను వరకూ తన విజయ యాత్ర (మధ్యలో వచ్చిన అందరివాడు, సొంతం మినహాయించి) కొనసాగిస్తున్న శ్రీను వైట్ల గారు తన మొదటి సినిమా జ్ఞాపకాల్ని 'కౌముది' పాఠకులతో ఇలా పంచుకుంటున్నారు.



మాది తూర్పు గోదావరి జిల్లా లో రామచంద్రాపురం దగ్గర ఉన్న కందులపాలెం అనే పల్లెటూరు. నాన్నగారు వ్యవసాయం చేసేవాళ్ళు. నాన్న వాళ్ళు ఐదుగురు అన్నదమ్ములు..వాళ్ళు, అత్తయ్యలూ.అందరూ కలిసి చాలా పెద్ద ఫేమిలీ. అందరి మధ్యలో నా బాల్యం సరదాగా గడిచిపోయింది. ఎప్పుడు ఎలా మొదలైందో తెలీదు కానీ చిన్నప్పటినుంచీ సినిమాలంటే విపరీతమైన పిచ్చి. ఎప్పటికైనా సినిమాల్లోకి వెళ్ళిపోయి ఏదో చెయ్యాలనే అలోచన చిన్నప్పటినుంచే ఉండేది.. ఏమి చెయ్యాలో తెలీదు, అది ఎలా సాధ్యపడుతుందో కూడా ఆలోచించలేని వయసు. పైగా మాదొక చిన్న పల్లెటూరు, సినిమా రంగమంతా ఉండేది మద్రాసులో..అస్సలు ఎక్కడా పొసగని దూరాలు. ఐనా నా అలోచనలన్నీ సినిమాలచుట్టూనే తిరుగుతుండేవి..

ఇంటర్మీడియట్‌కి వచ్చే సరికి, 1984లో, కాకినాడ వెళ్ళి చదువుకుంటానని ప్రపోజల్ పెట్టాను. పక్కనే రామచంద్రాపురంలో కాలేజీ ఉన్నా, కాకినాడ ఎందుకు వెళ్తానన్నానంటే అక్కడైతే మనల్నెవరూ చూడరూ, విడిగా రూమ్ లో వుంటూ ఇష్టమొచ్చినన్ని సినిమాలు చూడొచ్చు అనీ.. ఆ విధంగా 1984-86 మధ్యలో కాకినాడలో ఇంటర్మీడియట్ చదువుతూ

ఎడాపెడా సినిమాలు చూస్తూ కాలక్షేపం చేసే వాడిని. ఫ్రెండ్స్ అందరూ హీరోల్ని  అభిమానిస్తుంటే నేను మాత్రం మణిరత్నం గారిని అభిమానిస్తుండేవాడిని. డైరెక్టర్ కావాలన్న ఆలోచన అప్పట్లోనే ఉండేదోమో అంతగా గుర్తులేదు. చదువు విషయానికొస్తే, మరీ తప్పితే తిడతారు కాబట్టి పాసవడానికి కావల్సినంత చదివి  ఎలాగైతేనేం ఇంటర్మీడియట్ పూర్తిచేశాను. కథలు వ్రాయడం, నాటకాలు వేయడం..ఇలాంటివేమీ లేవు. ఉన్న టైమంతా సినిమాలు చూడ్డమే.!

తరువాత బి.ఎస్సీ చదవాడినికి మళ్ళీ కాకినాడకే వచ్చాను. ఐతే ఇంక అప్పటికే సినిమా జ్ఞానమంతా ఒంటబట్టేసింది కాబట్టి మద్రాసు వెళ్ళిపోవాలని నిర్ణయానికివచ్చేశాను . బి.ఎస్సీ లో చేరిన నాలుగైదు నెలలకే ఫీజులు కట్టడానికని ఇంట్లో ఇచ్చిన డబ్బులు జేబులో పెట్టుకుని బొకారో ఎక్స్‌ప్రెస్ ఎక్కేశాను మద్రాసుకి..!



మద్రాసు ఎలా ఉంటుందో తెలీదు.. ఎక్కడికి వెళ్ళాలో తెలీదు..ప్రయాణం మొదలైంది. ట్రైన్‌లో ఒక కుర్రాడు పరిచయమయ్యాడు. అతనిది మద్రాసు దగ్గరలోనే ఏదో ఒక వూరు. అతని స్నేహితుడు జాస్తి చౌదరి అనే అతను మద్రాసులో ఉంటాడని చెప్పి ఎడ్రసు ఇచ్చి, ఎప్పుడేనా వీలైతే కలుసుకోమని చెప్పాడు.. మన బుర్ర వేగంగా పనిచేసింది, ముక్కూ మొహం తెలీని మద్రాసులో దిగగానే ఏం చెయ్యాలో అప్పుడే నిర్ణయించుకున్నాను.

మద్రాసు సెంట్రల్ స్టేషన్‌లో దిగగానే తెలిసిందేమిటంటే అక్కడ సిటీ బస్సులన్నీ సమ్మె ఆ రోజు. చేతిలో జాస్తి చౌదరి అనే  అపరిచిత స్నేహితుడి చిరునామా ఉంది. పాండీ బజార్.. ఎంతదూరం ఉంటుందో తెలీదు. నడవడం మొదలెట్టాను. అలా దాదాపు 15 కి.మీ. దూరం నడిచి వెళ్ళి  జాస్తి చౌదరి రూమ్ తలుపు తట్టాను.  రైల్లో కలిసిన కుర్రాడు నాకు బాగా ఫ్రెండ్ అనీ, అతనే ఇక్కడికి వెళ్ళమన్నాడనీ నమ్మకం కుదిరేలా చెప్పాను. అతను సరేనని నేను తనతో మూడు రోజులు ఉండడానికి ఒప్పుకున్నాడు.. అదిచాలు. మిగతా విషయాలు  మూడు రోజుల తర్వాత ఆలోచిద్దాంలే అని అక్కడ తాత్కాలికంగా సెటిలయ్యాను.

ఆ మూడు రోజుల్లోనే బయటికి భోజనానికి వెళ్ళినప్పుడు కృష్ణవంశీ పరిచయమయ్యాడు. ‘నాకు వసతి కావాలని‘ అడిగితే తన రూమ్‌లో ఉండమని  అన్నాడు. అలా కృష్ణవంశీ రూమ్మేట్‌గా సెటిలయ్యాను. చేతిలో డబ్బులున్నాయి కాబట్టి తిండికేమీ ఇబ్బంది లేకుండా గడిచిపోయింది. అలా మద్రాసు వచ్చిన పదిహేను రోజులకి ఇంటికి ఉత్తరం రాశాను.. ‘ఇలా మద్రాసులో ఉన్నాను, నాకోసమేమీ బెంగపడకండి, నేను క్షేమంగానే ఉంటున్నాను. నేనే మళ్ళీ ఉత్తరం రాస్తాను‘ అని. అప్పటికే ఇంట్లో వాళ్ళు నాకోసం తీవ్రంగా వెదుకుతున్నారంట.. నా అడ్రసు తెలిస్తే వచ్చి నన్ను లాక్కెళ్ళి పోవడం ఖాయం..అందుకే అడ్రసు లేకుండా అప్పుడప్పుడూ నేనే ఉత్తరాలు వ్రాస్తుండే వాడిని.. ( ఓ ఆరునెలల తరువాత ఇంటికి వెళ్ళి అందరినీ ఒప్పించి మద్రాసు చేరుకోవడం..అదంతా మరో కథ).

అలా కృష్ణవంశీ రూమ్‌లో చేరిన రెండునెలలకే తను హైదరాబాదు వెళ్ళిపోయాడు. ఇంక రూమ్‌లో ఒక్కడినే మిగిలిపోయాను. ఎలాగైనా సినిమా రంగంలో చిన్న అవకాశం రావాలి అని తిరుగుతుండేవాడిని. అలా ఉండగా తూర్పుగోదావరి జిల్లాకే చెందిన ఒక డిస్ట్రిబ్యూటర్ ద్వారా గోగినేని సుబ్బారావు గారు అనే ప్రొడ్యూసర్ గారు పరిచమయ్యారు (చిన్ని కృష్ణుడు, పడమట సంధ్యారాగం అనే సినిమాల నిర్మాణంలో ఆయనకి భాగస్వామ్యం ఉంది). నా ఆసక్తి తెలుసుకుని చలసాని రామారావు అనే డైరెక్టర్‌కి నన్ను పరిచయం చేశారు. అప్పుడాయన బాలకృష్ణగారితో ‘ప్రాణానికి ప్రాణం‘ అనే సినిమా తీస్తున్నారు. ఆ విధంగా చలసాని రామారావు గారి వద్ద ఆ

సినిమాకి అప్రెంటిస్‌గా చేరాను. అలా 1989 మార్చిలో  సినిమా రంగంలో నన్ను అడుపెట్టనిచ్చిన మొదటి సినిమా 'ప్రాణానికి ప్రాణం.'! సినిమా పూర్తయినంత వేగంగానూ అట్టర్ ఫ్లాప్ ఐంది. ఇదేంట్రా బాబూ పని చేసిన మొదటి సినిమానే ఇలా బాల్చీ తన్నేసిందని అనుకుంటుండగా శివ రిలీజై రామ్‌గోపాలవర్మగారి పేరు ఆంధ్ర దేశమంతా మార్మోగిపోవడం మొదలైంది. ఆయన దగ్గర అసిస్టెంట్ గా చేరదామని నేనూ హైదరాబాదు చేరుకున్నాను..



ఐతే అప్పటికే ఆయనదగ్గర అసిస్టెంట్లుగా చేరడానికి వచ్చిన వాళ్ళ క్యూ కొండవీటి చాంతాడంత ఉంది.. అక్కడ వీలు కాకపోవడంతో ఏంచెయ్యాలా అని వెదుకుంతుండగా 'ప్రాణానికి ప్రాణం' రోజుల్లో పరిచయమైన డైరెక్టర్ సాగర్ గారు ఎదురయ్యారు. ఆయన్ని ఒప్పించి అసిస్టెంట్ గా చేరాను.. ఆ సినిమా పేరు 'నక్షత్ర పోరాటం.' నన్ను అసిస్టెంట్‌ని చేసిన మొదటి సినిమా అది..! ఆ విధంగా సాగర్ గారి వద్దనే 'అమ్మ దొంగా' సినిమా వరకూ పనిచేశాను. 'అమ్మ దొంగ ' తరువాత ఇంక సొంతంగా డైరెక్షన్ చెయ్యగలననేనమ్మకం కలిగి, అసిస్టెంట్ గా మానేసి, కథలు తయారు చేసుకోవడం మొదలుపెట్టాను.

తొందరలోనే సాంబిరెడ్డి అనే ఆయన నాకు మొదటి సినిమా అవకాశం ఇచ్చారు. సినిమా పేరు 'అపరిచితుడు' , రాజశేఖర్ హీరో. మొదటి షెడ్యూలు అవగానే హీరోగారికీ నిర్మాత గారికీ వచ్చిన అభిప్రాయ బేధాల వల్ల ఆ ప్రోజెక్ట్ ఆగిపోయింది. మళ్ళీ కథ మొదలైంది..! ఏం చెయ్యాలీ..నిరాశ పడి లాభంలేదు. ప్రయత్నాలు కొనసాగించాల్సిందే ననుకుని మళ్ళీ కథలమీద కూర్చోవడం మొదలెట్టాను. అప్పుడు తయారైందే 'నీకోసం' కథ.

నాతో బాటు పనిచేసిన కెమేరామేన్ నా గురించి కొత్తగా సినిమా తీద్దామనుకుంటున్న బాల్‌రెడ్డి మిత్రబృందానికి చెప్పడంతో వాళ్ళే నా దగ్గరికి సినిమా తీద్దామని రావడం, 'నీకోసం' మొదలు పెట్టడం జరిగింది. రవితేజ, మహేశ్వరి కాంబినేషన్. సినిమా మొదలైతే ఐంది కానీ ఆది నుంచీ అన్నీ కష్టాలే. నిర్మాతలు తలా ఒక రెండు , మూడు లక్షలు వేసుకుని ప్రోజెక్టు మొదలెట్టారు, కానీ మధ్యలో బడ్జెట్ ఐపోవడం..మళ్ళానేనే ఎలానో మరికొంత పెట్టుబడి పెట్టడం..అలా అష్ట కష్టాలూ పడి  సినిమాని పూర్తిచేశాను. 38 లక్షల్లో 28 వర్కింగ్ డేస్‌లో తీసిన  సినిమా పూర్తి కావడానికి మొత్తం సంవత్సరంన్నర పట్టింది.



ఆ సినిమా ప్రివ్యూ చూసిన నాగార్జున గారు నాకు డైరెక్షన్ ఆఫర్ ఇస్తానన్నారు. అలానే ఆ సినిమా చూసిన రామోజీ రావు గారు మొత్తం ఆంధ్రాకి దాన్ని కొనుగోలుచేసి రిలీజ్ చేశారు. 1999 డిసెంబర్ 3న రిలీజైంది. సినిమా బ్రహ్మాండమైన హిట్ కాకపోయినా కోటిరూపాయలు వసూలు చేసి కమ్మర్షియల్‌గా సక్సెస్ అవడమే కాకుండా డైరెక్టర్‌గా నాకు మంచి పేరు తీసుకొచ్చింది. అదే సంవత్సరం 7 నంది అవార్డుల్ని కూడా గెలుచుకుంది.. ఉత్తమ కొత్త దర్శకుడిగా నాకు, ఉత్తమ స్క్రీన్‌ప్లే కీ,  ద్వితీయ ఉత్తమ చిత్రంగా సినిమాకీ కూడా ఎవార్డులొచ్చాయి. ఆ విధంగా నా దర్శకత్వంలో విడులైన మొదటి సినిమా 'నీకోసం'.

ఆ సినిమా విజయంతో నామీద నమ్మకంతో రామోజీ రావు గారు నాకు 'ఆనందం' సినిమా కి అవకాశం ఇచ్చారు.. అదెంత కమ్మర్షియల్ సక్సెస్ ఐందో మీ అందరికీ తెలుసు. ఇలా చెప్పాలంటే నన్ను దర్శకుడిగా అగ్రస్థాయిన నిలిపిన మొదటి సినిమా 'ఆనందం'!

*ఇన్నాళ్ళ అనుభవంలో తెలిసిందేమిటంటే.. ' కేవలం సినిమాల మీద ఆసక్తి మాత్రం ఉంటే సరిపోదు. బాగా కష్టపడే మనస్తత్వం ఉండాలి. ఎలాంటి క్లిష్టమైన పరిస్థితులనైనా తట్టుకునే ఓర్పు ఉండాలి. ఎదురు దెబ్బలు తగిలినప్పుడు బెదిరిపోకుండా నిలిస్తేనే ఎప్పటికైనా విజయం లభిస్తుంది..కష్టపడే వాళ్ళకి అద్భుతమైన అవకాశాల్నిస్తుంది చిత్రసీమ..! ఇదొక వండర్ ఫుల్ ఫీల్డ్'!*

## సరదా..సరదాగా..!

*రామారావు, సుబ్బారావు షికారు కెళ్ళారు. అక్కడే ఓ గొర్రెలమంద ఎదురొస్తూ కనిపించింది.*

*" ఆ మందలో ఎన్ని గొర్రెలున్నాయో చెప్పగలవా?"*

*" ఓ! సరిగ్గా అయిదువందల నలభై రెండు!"*

*"అరె! అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలిగావు?"*

*"ఇందులో పెద్ద ఆశ్చర్యమేముంది? వాటి కాళ్ళన్నీ లెక్కవేసి, మొత్తాన్ని నాలుగుపెట్టి హెచ్చవేసి, ఎనిమిది పెట్టి భాగారిస్తే - వచ్చేస్తుంది.."*

****

*రోడ్డు మీద ఒక్క బూటుతోనే నడుస్తున్న వ్యక్తిని చూసి ధర్మారావు జాలిపడ్డాడు.*

*"పాపం! మీ బూట్లలో ఒకటి పోయినట్లుంది.." అన్నాడు సానుభూతిగా.*

*"హ్హహ్హహ్హ....పిచ్చివాడా! పోవడం కాదు! ఒకటి దొరికింది..!" అన్నాడా వ్యక్తి ఖస్సున నవ్వుతూ.!*

*యర్రంశెట్టి శాయి*